సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



ఎండకాలంలోనూ మత్తళ్ల సవ్వడి

ఎండాకాలంలో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు దూకుతున్నాయి. ఎస్సారెస్పీ కాలువ నీరు పారడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. 8లో▸



బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలి


కేంద్రంలోని బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. 8లో▸



గరిష్టం/కనిష్టం
35.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండవేడి అధికమై మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

సీపీఆర్‌పై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

పెద్దపల్లిరూరల్: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. గురువారం న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఆరోగ్య అధికారితో కోర్టు ప్రాంగణంలో సీపీఆర్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. రోజురోజుకూ మారుతున్న జీవనశైలిలో ప్రతిఒక్కరూ వ్యాయామం, యోగాతోపాటు సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సీపీఆర్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి అర్జున్, డాక్టర్లు సంపత్, మమత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, కోర్టు పోలీసులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు



భద్రతను పరిశీలిస్తున్న ఏసీపీ గిరిప్రసాద్

గోదావరిఖని/రామగిరి: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు ఏసీపీ గిరిప్రసాద్ గురువారం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్లను అనుమతించొద్దని, అధికారులూ ఫోన్లు తీసుకెళ్లవద్దని సూచించారు. రామగిరి మండలం నాగేపల్లి పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సందర్శించి విద్యార్థుల సాకర్యాలను పరిశీలించారు.

సీనియర్ అసిస్టెంట్లు, గిర్దవార్ల బదిలీ

పెద్దపల్లిరూరల్: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు గిర్దవర్లను బదిలీ చేస్తూ కలెక్టర్ సంగీత గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రామగుండం సీనియర్ అసిస్టెంట్ ఎ.భవానీప్రసాద్‌ను ధర్మారానికి, ధర్మారం సీనియర్ అసిస్టెంట్ ఎండీ.ఖాజాపాషాను రామగుండంకు బదిలీ, ధర్మారంలో గిర్దవార్–2 వి.నవీన్ చంద్రను మంథని ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం గిర్దవార్–2 టి.అంజయ్యను ధర్మారానికి, రామగిరి గిర్దవార్–2 డి.సతీశ్ కుమార్‌ను పెద్దపల్లి గిర్దవార్–2గా బదిలీ చేశారు.

సొంతగూటిని దాటడం లేదు..!

- పార్టీ జిల్లా అధ్యక్షులంతా రామగుండం వారే..
- నియోజకవర్గం దాటి బయటకు రాని నేతలు
- అక్కడే పర్యటనలు.. బల ప్రదర్శనలు
- తాజా బీజేపీ అధ్యక్షుడు రావుల రాజేందర్ కూడా ఇక్కడి వారే..



చందర్ · మక్కాన్‌సింగ్ · రాజేందర్

సాక్షి, పెద్దపల్లి: ఓ పార్టీకి జిల్లా అధ్యక్షుడు అంటే.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ.. పార్టీని బలోపేతం చేయాలి. కార్యకర్తలు, పార్టీకి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యలపై పోరాటం చేయాలి. పార్టీలో నేతల మధ్య ఉన్న గ్రూప్ రాజకీయాలకు చెక్‌పెడుతూ పార్టీ పటిష్టతకు తోడ్పాటు అందించాలి. కానీ.. జిల్లాలో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు మాత్రం తమ నియోజకవర్గం దాటి బయటకు రావటంలేదు. కేవలం తమ నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాలకే పరిమితం అవుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతోపాటు, పార్టీ కార్యక్రమాలకు.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర కార్యక్రమమైనా.. బీజేపీ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్ అయినా.. ఇలా పార్టీ కార్యక్రమాలకు జిల్లా అధ్యక్షులు హాజరుకావటం లేదు. దీంతో మిగితా ప్రాంతాల్లోని పార్టీ కార్యకర్తలు పార్టీలో తమకు జరుగుతున్న వివక్షను మరే ఇతర సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురు అక్కడి వారే..!

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కాంగ్రెస్ అధ్యక్షుడిగా మక్కాన్ సింగ్ ఠాగూర్ కొనసాగుతున్నారు. ఇక బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఉండగా.. పార్టీలో గ్రూప్ రాజకీయాలు, జిల్లా అంతటా పర్యటించలేనప్పుడు అధ్యక్ష పదవి ఎందుకని కొద్దిరోజుల క్రితమే రాజీనామా చేశారు. దీంతో ఆయన స్థానంలో రామగుండం నియోజకవర్గానికే చెందిన మాజీ కార్పొరేటర్ రావుల రాజేందర్‌ను నియమించినట్లు ఆ పార్టీ ప్రకటించింది. దీంతో జిల్లాలో మూడు నియోజకవర్గాలుండగా.. మూడు ప్రధాన పార్టీల్లోని జిల్లా అధ్యక్షులు అక్కడి ప్రాంతానికి చెందినవారే కావటం గమనార్హం.

రెండో 'సారీ'

నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత వరుసగా రెండుసార్లు బీజేపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు రామగుండం ప్రాంతం వారినే వరించాయి. దీంతో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి అధ్యక్ష పదవి కోసం పోటీ పడి న నేతల్లో అసంతృప్తి నెలకొంది. కొత్త జిల్లా అధ్యక్షుడైనా రామగుండంకే పరిమితం కాకుండా నేతలను సమన్వయం చేస్తూ జిల్లా అంతటా పర్యటించేనా...? అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఎస్సై మృతితో విషాదం

- సిరిసిల్లలో హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్సైగా సేవలు
- గోదావరిఖనిలో తిలక్‌నగర్ శ్రీనుగా సుపరిచితుడు
- మూగబోయిన జమ్మికుంట మండలం మోత్కులగూడెం



తిలక్‌నగర్‌లో శ్రీనివాస్ దంపతుల మృతదేహాలు

గోదావరిఖని/జమ్మికుంట/సిరిసిల్ల: జనగామ ఎస్సైగా పనిచేస్తున్న కాసర్ల శ్రీనివాస్ ఆత్మహత్య ఉమ్మడి జిల్లాను కదలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆయన తిలక్‌నగర్ శ్రీనుగా అందరికీ సుపరిచితుడు. ఆయన మరణవార్తతో చిన్ననాటి స్నేహితులంతా షాక్‌కు గురయ్యారు. కుటుంబ తగాదాలతో ఆయన భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె మృతిని తట్టుకోలేక సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెల్సిందే. మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాస్ బాల్యమంతా గోదావరిఖనిలోనే సాగింది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎక్కువ కాలం పనిచేశారు. ఎస్సైగా పదోన్నతిపై జనగామకు వెళ్లారు. స్వరూప, శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కుమారులు రవితేజ, భార్గవ్‌తేజ సంతానం. ఆయన మరణవార్త విని ఆప్తమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. దంపతుల మృతదేహాలను ఇక్కడకే తీసుకురానున్నట్లు బంధువుల ద్వారా తెల్సింది.

మూగబోయిన మోత్కులగూడెం

ఎస్సై శ్రీనివాస్ భార్య స్వరూపది జమ్మికుంట మున్సిపాలిటీ పరిధి మోత్కులగూడెం. గ్రామానికి చెందిన శీలం కృష్ణస్వామి, లక్ష్మి పెద్ద కూతురు. శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అనంతరం మోత్కులగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకునేలా ఇంటి స్థలం, వ్యవసాయ భూమి కూడా కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంతలోనే ఈ సంఘటన చోటుచేసుకోవడంతో గ్రామం మూగబోయింది. మృతుల కుటుంబానికి జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి సానుభూతి తెలిపారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సిరిసిల్లతోనూ అనుబంధం

ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కాసర్ల శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్లతోనూ అనుబంధం ఉంది. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా 2002 నుంచి పనిచేశారు. ఏఎస్సైగా పదోన్నతి లభించాక 2011వరకూ ఇక్కడే విధులు నిర్వర్తించారు. వేములవాడలోనూ ఏఎస్సైగా పనిచేశారు. నక్సలైట్ల కదలికలు ఉన్న రోజుల్లోనూ చురుగ్గా పనిచేసి అధికారుల మన్ననలు పొందారు. సుమారు దశాబ్దకాలం జిల్లాలో పనిచేసిన శ్రీనివాస్ ఎస్సైగా పదోన్నతి పొంది జనగామకు వెళ్లారు. ఇటీవల తన కుమారుడి వివాహానికి సైతం జిల్లా నుంచి పలువురు వెళ్లారు.

మన పోలీసులు.. మరోసారి హస్తినకు..?

- కరీంనగర్ పోలీసులపై మరోసారి పార్లమెంటుకు ఫిర్యాదు
- స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేసిన బీజేపీ ఎంపీలు
- నాలుగేళ్లలో మూడోసారి పార్లమెంటుకు కంప్లయింట్
- అరెస్టుపై స్పీకర్‌కు సమాచారం ఇచ్చిన సీపీ సుబ్బారాయుడు
- బీజేపీ నిరసనలు, బీఆర్ఎస్ ప్రెస్‌మీట్లతో ఉమ్మడిజిల్లాలో పెరిగిన వేడి



ఈనెల 5న తెల్లవారుజామున 12.15 నిమిషాలకు ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అరెస్టు వ్యవహారం మరోసారి ఢిల్లీకి చేరింది. పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాల్సిన బాధ్యత కలిగిన ఎంపీని అన్యాయంగా, అక్రమంగా ఎలాంటి వారెంట్లు లేకుండా అరెస్టు చేశారంటూ బీజేపీ ఎంపీలు బుధవారం పార్లమెంటు స్పీకర్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఆర్టికల్ 223 ప్రకారం.. బీజేపీ ఎంపీ సోయం బాపూరావు ఈ నోటీసులను ఇచ్చారు. దీంతో కరీంనగర్ పోలీసులు మరోసారి వార్తల్లో నిలిచారు. వాస్తవానికి బండి సంజయ్, పోలీసుల మధ్య జరుగుతున్న ఘర్షణ ఈనాటిది కాదు. నాలుగేళ్లుగా సంజయ్– పోలీసుల నడుమ నడుస్తున్న ఈ వివాదంలో పార్లమెంటుకు ఫిర్యాదు చేయడం ఇది మూడోసారి. తాజాగా మరోసారి ఈ వివాదం పార్లమెంటు గడప తొక్కడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. మొత్తం అరెస్టు అనంతరం వరంగల్ పోలీసులకు అప్పగించిన వ్యవహారం మొత్తాన్ని స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు మెయిల్ ద్వారా తెలియజేశారు. వివాదం ఫిర్యాదుకే పరిమితమవుతుందా? మరోసారి కరీంనగర్ పోలీసులు ప్రివిలేజ్ కమిటీ ఎదుట హాజరవుతారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు నగరంలో బీజేపీ చేపట్టిన నిరసనలు, బీఆర్ఎస్ ప్రెస్‌మీట్‌తో రాజకీయం వేడెక్కింది.

గతంలో ఏం జరిగింది?

- 2019లో ఆర్టీసీ సమ్మె సందర్భంగా సంజయ్– పోలీసుల మధ్య తొలిసారిగా వివాదం చెలరేగింది. ఆర్టీసీ కార్మికుడు బాబు ఆకస్మికంగా మరణించాడు. దీంతో అతని మృతదేహంతో ధర్నా చేసేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఇన్‌చార్జి సీపీగా డీఐజీ సత్యనారాయణ వ్యవహరించారు. ఆ సమయంలో పోలీసుల తనతో దురుసుగా వ్యవహరించారని బండి తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం పార్లమెంటు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు జరిగిన వివాదంపై వివరణ ఇచ్చారు.
- 2022 జనవరి 2న జీవో 317ను రద్దు చేయాలని సంజయ్ తన పార్టీ కార్యాలయంలో తలపెట్టిన 'జాగరణ్ దీక్ష' తీవ్ర ఉద్రిక్తలకు దారి తీసింది. రాత్రిపూట సీపీ సత్యనారాయణ స్వయంగా తలుపులు బద్దలుకొట్టి మరీ ఎంపీ బండి సంజయ్, అతని అనుచరులను అరెస్టు చేయడంతో అప్పట్లో తీవ్ర వివాదంగా మారింది. ఇదికాస్త పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి చేరింది. దీంతో అరెస్టు సమయంలో సీపీ సత్యనారాయణ, ఏసీపీలు ప్రకాశ్, తుల శ్రీనివాస్‌తోపాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్–ఇన్‌స్పెక్టర్లు కూడా ఢిల్లీకి కమిటీ ముందు హాజరవ్వాల్సి వచ్చింది.
- అదే నెలలో బీసీ ఎంపీని అరెస్టు సమయంలో ఇబ్బందిపెట్టారంటూ బీసీ కమిషన్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీంతో అప్పటి సీపీ సత్యనారాయణ, అడిషన్ డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.
- గతేడాది నవంబరు 27వ తేదీన భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయనను కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని నివాసంలో దింపి వెళ్లిపోయారు. ఈ విషయంలోనూ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసేందుకు సంజయ్ సిద్ధమైనా ఆఖరు నిమిషంలో విరమించుకున్నారు.
- ఏప్రిల్ 5న తెల్లవారుజామున 12.15 నిమిషాలకు ఎస్సెస్సీ పేపర్ లీకేజీ కుట్రలో ఎంపీ బండి సంజయ్ పాత్ర ఉందంటూ కరీంనగర్ పోలీసులు ఆకస్మిక అరెస్టుకు దిగారు. ఈ సందర్భంగా సంజయ్‌కు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సంజయ్ ప్రతిఘటించడం, అనుచరులు అడ్డుకోవడంతో బలవంతంగా అరెస్టు చేశారు. దీనిపైనా కేంద్ర ప్రభుత్వ పెద్దలతోపాటు, బీజేపీ అగ్రనేతలు భగ్గుమన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ మరోసారి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీ సుబ్బారాయుడు సైతం బుధవారం జరిగిన అరెస్టు వ్యవహారం మొత్తాన్ని పార్లమెంటు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈ వివాదం మరింత ముదిరితే కరీంనగర్ పోలీసులు మరోసారి హస్తిన ప్రయాణం తప్పదని అభిప్రాయపడుతున్నారు. ఏం జరిగినా తాము చట్టపరిధిలోనే వ్యవహరించామని కరీంనగర్ పోలీసులు ధీమాగా ఉన్నారు.

జైలు వద్ద సందడి

బండి సంజయ్‌ను కరీంనగర్ జైలుకు తరలించిన అనంతరం గురువారం ఉదయం నుంచి జిల్లా కారాగారం వద్ద మీడియా ప్రతినిధుల సందడి నెలకొంది. ఆయనను కలిసేందుకు బండి సంజయ్ భార్య అపర్ణ వచ్చారు. ఆమె వెంట బండి శ్రవణ్ కుమార్, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఉన్నారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ కూడా ములాఖత్ ద్వారా బండిని పరామర్శించారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు



జిల్లాకేంద్రంలో జెండావిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాకేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అకారణంగా అరెస్టు చేశారని ఆరోపించారు. ప్రతిపక్షాలను గొంతు నొక్కి పరిపాలన కొనసాగిస్తున్నారని, ప్రశ్నించేగొంతులు ఉండరాదని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని,వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే కుట్రలు చేస్తూ అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. అరెస్టులకు భయపడబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, నాయకులు చాతరాజు రమేశ్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

మెడికోల హెల్త్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికోలు

కోల్‌సిటీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మెడికోలు గురువారం గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహించారు. మెడికోలు, జీజీహెచ్ ఆసుపత్రి సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లతో చేపట్టిన ర్యాలీ, కార్పొరేషన్ కార్యాలయం వరకు సాగింది. వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేందర్ మాట్లాడారు. డబ్ల్యూహెచ్ఓ ఏటా ఏప్రిల్ 7న ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, ఈ ఏడాది 'అందరికీ ఆరోగ్యం' అనే సందేశంతో ముందుకొచ్చిందని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కంటినిండా నిద్ర, పోషకాహారం కరువైందని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ ప్రివెన్షన్ విభాగం హెచ్‌వోడీ మధుసూదన్, హెల్త్ ఎడ్యుకేటర్లు నాగరాజు, ప్రేమలత, ప్రొఫెసర్లు, మెడికోలు, పలు విభాగాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రండి..!

పెద్దపల్లి రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఈనెల 14న ఆవిష్కరించేకునేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరు బస్సుల్లో 300మంది చొప్పున అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రావాలని, ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రం నుంచి బస్సులు బయల్దేరాలని, తిరిగి చేరేవరకూ పర్యవేక్షించాలన్నారు.

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ త్వరలో ప్రారంభిస్తారని, దానికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు జిల్లాలో పూర్తి చేయాలని శాంతికుమారి తెలిపారు. లబ్ధిదారుని వాటా సేకరించా లని, గొర్రెల కొనుగోలుకు వెళ్లేందుకు సీనియర్ అధి కారిని నియమించాలని కలెక్టర్లకు తెలిపారు.

వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్ సంగీత అధికారులకు గొర్రెల పంపిణీ, అంబేడ్కర్ జయంతిపై పలు సూచనలు చేశారు. జిల్లాలోని లబ్ధిదారులలో మరణించిన 411 మంది నామిని వివరాలు సేకరించాలని, అధికారులు, సొసైటీ సభ్యులు, లబ్ధిదారులకు అవగాహనను వారం రోజుల్లో పూర్తి చేయాలని, లబ్ధిదారుల నుంచి వాటా సేకరణ ప్రారంభించాలని సూచించారు. జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లే వారి వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులతో ఏప్రిల్ 10 నాటికి సేకరించాలని, ప్రతి మండల పరిధిలో వెళ్లే బస్సులో అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయడంతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మచారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నాగలేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంగీత, అధికారులు







జైబోలో.. హన్మాన్‌కీ..

- అంజన్న స్వాములతో కిక్కిరిసిన కొండ
- కొండగట్టులో ఘనంగా చిన్నజయంతి

కొండగట్టు(చొప్పదండి): శ్రీరామ.. జయరామ.. జయజయ రామా నామస్మరణలతో కొండగట్టు అంజన్న క్షేత్రం పులకించిపోయింది. జైశ్రీరాం.. జైహనుమాన్ అంటూ జయజయ ధ్వనులతో కొండంతా మార్మోగింది. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న క్షేత్రం కాషాయమమైంది. దీక్షాపరులతో కిక్కిరిసింది. జయంతి ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రారంభం కాగా.. గురువారం అర్ధరాత్రి వరకు కూడా దీక్షపరులు కొండకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, ఇరుముడి సమర్పించి, మాల విమరణ చేశారు. పధాన అర్చకుడు జితేంద్రప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అరటిపండ్లతో అంజన్నకు ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజామున సుప్రభాతసేవా, పంచామృత అభిషేకం, పట్టువస్త్రాలంకరణ, పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. మాల విమరణకు కొండగట్టుకు భారీగా స్వాములు తరలివచ్చారు. బుధవారం రాత్రి వరకే లక్షకుపైగా భక్తులు రాగా.. గురువారం రాత్రి వరకు మరో లక్షన్నరకు పైగా భక్తులు మాల విరమణ చేశారు. కలెక్టర్ యాస్మిన్‌భాషా, ఎస్పీ భాస్కర్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఈవో వెంకటేశ్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలు





మండలంలోని చిన్నబొంకూర్‌లో కొలువైన మహమ్మాయిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈనెల ఒకటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. చివరిరోజైన గురువారం కుంకుమార్చనలు, మహామంత్ర పుష్పం, బలిహారణ, మధ్యాహ్నం చందనగోష్టి, హోమం, మంటపపూజలు, హోమం, దీపోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దేవరకొండ కృష్ణమాచార్యులు, రాధాకృష్ణమూర్తి, శ్రీధర్, ఈశ్వరా చారి, రాజబ్రహ్మచారి ఉన్నారు.

సుల్తానాబాద్‌రూరల్

క్లుప్తంగా

అమ్మ చూపు సజీవం

• మరణంలోనూ మరో ఇద్దరికి వెలుగులు


కౌశల్య(ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: అమ్మ మరణించినా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించారు. తల్లిని కోల్పోయిన దుఃఖంలో కూడా కుటుంబసభ్యులు సమాజహితం కోసం ఐ బ్యాంక్‌కు నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కీర్తి కౌశల్య(80) బుధవారం సాయంత్రం గుండెపోటుతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. తల్లిని కోల్పోయిన దుఃఖంలో కూడా అమ్మ నేత్రాలను దానం చేయడానికి కొడుకు, కోడలు రమేష్, రాజమణి, కూతుళ్లు, అల్లుళ్లు రాజేశ్వరీ, సమ్మయ్య, పద్మ, లింగమూర్తి, వసంత, భూమేష్, మనుమలు, మనుమరాళ్లు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి వాసు, టెక్నీషియన్ ఆరీఫ్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. నేత్రదాత కుటుంబాన్ని సదాశయ ఫౌండేషన్ బాధ్యులు అభినందించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): స్థానిక జ్యోతినగర్‌కు చెందిన గుమ్మడి శ్రీనివాస్(43) గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మంథనిలో సెల్‌ఫోన్ షాప్ నిర్వహిస్తున్న శ్రీనివాస్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.


రామగుండం ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

రామగుండం: పట్టణంలోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా షార్ట్‌టర్మ్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటనలో కోర్సుల వివరాలను వెల్లడించారు. ఈ పథకంలో ప్రవేశపెట్టిన కోర్సుల తరగతులకు ఈనెల 10 నుంచి 17వ తేదీలోగా ఔత్సాహికులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌తో పాటు ట్రెయినింగ్ ఆఫీసర్ పి.విద్యాసాగర్‌రెడ్డి కోరారు.

వ్యక్తిని కాపాడిన రివర్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి ఖని 5 ఇంక్‌లైన్‌కు చెందిన కొండ్ర ప్రసాద్ (40) నదిలో దూకేందుకు ప్రయత్నించగా రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ రివర్ పోలీసుల వివరాలు.. ప్రసాద్ కారు డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ కలహాలతో బాధపడుతూ మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం గోదావరిఖని గంగానగర్ బ్రిడ్జి వద్దకు వచ్చి నదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీస్ సదానందం గమనించి వెంటనే అదుపులోకి తీసుకున్నాడు. కౌన్సెలింగ్ నిర్వహించి గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా రివర్ పోలీస్ సదానందంను టూటౌన్ సీఐ వేణుగోపాల్ అభినందించారు.


మత్తడి దూకుతున్న గోపరపల్లె చెరువు


ఓదెలలో పారుతున్న డీ-86 కాలువ

ఎండాకాలంలోనూ మత్తళ్ల సవ్వడి


నిండుకుండలా కొలనూర్ చెరువు


నీటితో కళకళలాడుతున్న గోపరపల్లె చెరువు

ఎండాకాలంలో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు దూకుతున్నాయి. ఓదెల మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతో పాటు ఎస్సారెస్పీ కాలువ నీరు పారడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. గోపరపల్లె, కొలనూర్, ఉప్పరపల్లె గ్రామాల్లో చెరువుల మత్తళ్లు ఎగిసిపడడంతో పాటు చివరిభూములకు నీరందుతుండడంతో ఈయేడు పంటలకు ఢోకా లేదని రైతులు భరోసాతో ఉన్నారు. కొలనూర్, గుంపుల, ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, ఇందుర్తి గ్రామాల్లో 10 చెరువులతో పాటు 100 కుంటలు ఉన్నాయి. నెలరోజులుగా డీ-86 కాలువ నిండుకుండలా ప్రవహిస్తుండడంతో చివరి గ్రామాలైన గుంపుల, గూడెం, జీలకుంట, ఇందుర్తి, బాయమ్మపల్లె గ్రామాల్లోని పంటలకు నీరందుతోంది.

- ఓదెల(పెద్దపల్లి)

బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలి


మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సుల్తానాబాద్: కేంద్రంలోని బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు 'బీజేపీ కో హటావో దేశ్ కో బచావో' పేరుతో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీలో బీజేపీ ప్రధాన పాత్ర పోషిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, బీజేపీ నీచ రాజకీయాలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ కమిటీ కన్వీనర్‌గా తాండ్ర సదానందం, కో-కన్వీనర్‌గా కదారి సునీల్, కోశాధికారిగా కొడెం స్వామిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర సభ్యులు గౌతం గోవర్ధన్, పల్ల శ్రీనివాస్ రెడ్డి, పల్లె గట్టయ్య, రాకేష్, పెద్దపల్లి మండల కార్యదర్శి పేర్క సతీశ్, పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్, పుసాల రమేశ్, మానస్ కుమార్, బాలసాని లెనిన్, సదానందం, శంకర్, ప్రేమ్ పాల్గొన్నారు.

మరోసారి బీజేపీదే అధికారం


సుల్తానాబాద్‌లో జెండా ఎగురవేస్తున్న అర్జున్ రావు, నాయకులు

సుల్తానాబాద్: కేంద్రంలో మరోసారి బీజేపీనే అధికారంలోకొస్తుందని పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్ రావు అన్నారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా గురువారం మండలకేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కేంద్రంతోపాటు రాష్ట్రంలోనూ కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికమని అన్నారు. శాస్త్రినగర్ బూత్ అధ్యక్షుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి బుసారపు సంపత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజు, సీనియర్ నాయకులు చింతల లింగారెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు గడ్డం మహిపాల్ రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి సొదరి మహేందర్ యాదవ్, కొమ్ము తిరుపతి యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు పల్లె తిరుపతి, గజభీంకర్ పవన్, ఎనగందుల సతీశ్, పట్టణ కార్యదర్శి గుడ్ల వెంకటేష్, బుర్ర సతీశ్, రాసూరి ప్రవీణ్, మామిడి శేఖర్, గోసుగుల రవీందర్, మెండ శంకర్, జెట్టి రాజు, గడాల ఆయుష్, కూకట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ, లీకేజీల ప్రభుత్వం


మాట్లాడుతున్న రావుల రాజేందర్

గోదావరిఖని: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్యాకేజీ, లీకేజీగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ అరెస్ట్ డ్రామా ఆడుతోందన్నారు. ప్రగతి భవన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారనే సర్వేల మేరకు ప్రజల దృష్టిని మరల్చేందుకు అరెస్టలపర్వానికి తెరతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో బీజేపీ గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. నాయకులు పిడుగు క్రిష్ణ, కోమల మహేష్, సోమారపు లావణ్య, సోమారపు అరుణ్‌కుమార్, మామిడి రాజేష్ పాల్గొన్నారు.

అవమానం భరించలేక ఒకరి బలవన్మరణం

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని బాపూజీనగర్‌కు చెందిన తోడేటి పర్వతాలు(67) అవమానం భరించలేక గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. రాజయ్యకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు సంతోష్‌కుమార్‌కు సింగరేణిలో ఉద్యోగం పెట్టిస్తామని బాపూజీనగర్‌కు చెందిన కొంతం చందు, చిక్కుడు శ్రావణ్ ఏడేళ్ల క్రితం రూ.పది లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం పెట్టించకపోవడంతో రెండేళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించగా వారు తిరిగి డబ్బులు ఇచ్చారు. అప్పటి నుంచి చందు అతడి తల్లి, శ్రావణ్ అతడి తల్లి కలిసి నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పర్వతాలు, అతడి భార్య రాజేశ్వరి ఇంటికి వెళ్తున్న సమయంలో చందు, అతడి తల్లి, శ్రావణ్, అతడి తల్లి బూతులు తిడుతూ, ఎందుకు బతుకుతున్నావు అంటూ తిట్టారు. దీంతో మనస్తాపం చెందిన పర్వతాలు గురువారం ఉదయం ఇంటి ముందు ఉన్న చింతచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

తేనెటీగల దాడిలో గాయాలు


గాయపడిన యువకుడు

రామగిరి(మంథని): మండలంలోని సెంటినరీకాలనీలో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద గురువారం మధ్యాహ్నం వివిధ అవసరాల నిమిత్తం బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారులపై తేనెటీగలు దాడి చేశాయి. బ్యాంక్ సమీపంలోని వృక్షాలపై తెట్టలు ఏర్పాటు చేసుకున్న తేనెటీగలు ఒక్కసారిగా కుప్పలు కుప్పలుగా లేచి దాడి చేయడంతో ఖాతాదారులు పరుగులు పెట్టారు. తేనెటీగల దాడిలో 20 నుంచి 30 మంది వరకు గాయపడ్డారు.

ఇంగ్లిష్ పరీక్షకు 7,912 మంది హాజరు

సాక్షి, పెద్దపల్లి: గురువారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 7,915 మందికి గాను 7,912 మంది హాజరైనట్లు డీఈవో డి.మాధవి తెలిపారు. మొత్తంగా 99.9 శాతం హాజరు నమోదైనట్లు పేర్కొన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని తెలిపారు.

నిబంధనల మేరకే 'డబుల్' ఇళ్లు


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కాల్వశ్రీరాంపూర్: నిబంధనల మేరకే అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించామని పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాధవ రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులతో ఇళ్ల కేటాయింపుపై సమీక్షించారు. మండల కేంద్రంలో 240 ఇళ్లు నిర్మించారు. 2016లో 50 మందిని గ్రామసభ ద్వారా ఎంపిక చేశారు. మిగిలిన 190 ఇళ్లకు దరఖాస్తులు ఆహ్వానించగా.. 24 పంచాయతీల నుంచి 1604 మంది దరఖాస్తు చేసుకున్నారు. సమగ్ర సర్వే చేసి ఆయా గ్రామాల్లో 160 మందిని గుర్తించి పారదర్శకంగా ఎంపిక చేశామని, మిగిలిన 30 ఇళ్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిక చేస్తామని తహసీల్దార్ అనుపమరావు తెలిపారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఆర్ఐలు పాల్గొన్నారు.




యైటింక్లయిన్‌కాలనీ:పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. రామగుండంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఎన్టీపీసీ రింగ్ రోడ్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు గోపినాథ్, కృష్ణానగర్‌లోని రాధాకృష్ణ ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. యైటింక్లయిన్‌కాలనీ శ్రీభక్తంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు పాలపంచామృతలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం దీక్షాపరులు, భక్తులు బైక్‌ర్యాలీ చేశారు. గోదావరిఖనిలోని భరద్వాజనగర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వాహకులు కందూరి రమణాచార్య, పూజారి హరిప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకర్ ప్రసాదాచార్యులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్‌లోని శివాలయంలో ఉన్న హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. హనుమాన్‌దీక్షాపరులు భద్రాచలం వెళ్లేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి టికెట్లు సమకూర్చారు.

- సుల్తానాబాద్/రామగుండం/జ్యోతినగర్/గోదావరిఖనిటౌన్/యైటింక్లయిన్‌కాలనీ

వాకింగ్‌ట్రాక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

• ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్


శిలాఫలకం ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): కార్మికుల ఆరోగ్యం కోసం అబ్దుల్‌కలాం స్టేడియంలో ఏర్పాటు చేసిన వాకింగ్‌ట్రాక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ కోరారు. రూ.16.31లక్షలతో నిర్మించి వాకింగ్‌ట్రాక్ శిలాఫలకాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంస్థ రూ.కోట్లు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అన్ని ఏరియాల్లో స్విమ్మింగ్ పూల్స్, యోగా సెంటర్లు, జిమ్ పార్కులు, ఆటస్థలాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన వాకింగ్‌ట్రాక్‌ను ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమములో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికారుల సంఘం నాయకుడు రాంరెడ్డి, అధికారులు రాజేంద్రప్రసాద్, ధనుంజయ, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'దసరా' దర్శకుడికి సన్మానం


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న జీఎంలు, తదితరులు

రామగిరి(మంథని): దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెలను గురువారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు తన్నీరు వెంకటేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు సన్మానించారు. రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఓదెల చంద్రయ్య, తార దంపతుల కుమారుడు శ్రీకాంత్ దసరా సినిమాకు దర్శకుడిగా వ్యవహరించి సక్సెస్ అయ్యాడు. సెంటినరీకాలనీలోని జీఎం కార్యాయలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జీఎంలు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జీ- 3 ప్రాంతం నుంచి పెద్ద సినిమాకు దర్శకత్వం వహించడం చాలా గొప్ప విషయమని, శ్రీకాంత్ భవిష్యత్‌లో మరిన్ని సినిమాలకు దర్శకత్వం వహించి సక్సెస్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): మహనీయుల జయంతోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్థానిక విఠల్‌నగర్ సింగరేణి కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కమిటీ కన్వీనర్ మాదాసు రామ్మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి శంకర్, మైస రాజేష్, బొంకూరి మధు, పెద్దెల్లి ప్రకాష్, బూడిద మహేందర్, పర్వతాలు, ఇనుముల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రణదీవె ఆశయాలు కొనసాగిస్తాం


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): సీఐటీయూ నేత బీటీ రణదీవె ఆశయాలను కొనసాగిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మిక వర్గ సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన మహా వ్యక్తి బీటీఆర్ అన్నారు. స్పిన్నింగ్ మిల్‌లో కార్మిక వర్గం గురించి సంఘం పెట్టి పోరాటం చేసి, జాతీయ నాయకుడిగా పేరొందిన గొప్ప కార్మికవర్గ నేత అన్నారు. యూనియన్ జాతీయ అధ్యక్షుడిగా దేశ కార్మిక వర్గానికి సేవలు అందించారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాపాడమే రణదీవెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తోట నరహరరావు, నాయకులు ఆసరి మహేష్, ఆరెపల్లి రాజమౌళి, ఎస్కే గౌస్, అన్నం శ్రీనివాస్, నంది నారాయణ, సనం రవి, సురేష్, జి.సుమన్‌కుమార్, బి.ప్రవీణ్, లక్ష్మణ్, మల్యాల శ్యామల, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వంగల రామన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రాష్ట్రపతి భవన్ ఆహ్వానం


పూజశ్రీని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలకు చెందిన ఎం.పూజశ్రీ (9వ తరగతి) రూపొందించిన 'వాహనానికి యాక్సిల్ కెమెరా' వైజ్ఞానిక ప్రదర్శన న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందింది. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు ఎప్పటికీ సాధన చేయాలని, తద్వారా విశేషంగా రాణించవచ్చని పేర్కొన్నారు. పూజశ్రీ రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన జాతీయస్థాయిలో సైతం కీర్తి పతాకాన్ని ఎగురవేసిందని తెలిపారు. జాతీయ స్థాయి అసమాన ప్రతిభను కనబరిచినందుకు సృజనాత్మక తయారీని తెలుసుకోవడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశం అయ్యేందుకు అద్భుత అవకాశం దక్కిందని వివరించారు. మూడు రోజులపాటు నిర్వహించే (సైన్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఇంటర్ ప్రిన్యూర్) కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా నిపుణులతో మాటామంతి కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థిని ఘనంగా సత్కరించారు.

అమరవీరుల త్యాగ ఫలితమే ఐఎఫ్‌టీయూ జెండా


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

జ్యోతినగర్(రామగుండం): అమరవీరుల త్యాగ ఫలితమే ఎరుపెక్కిన ఐఎఫ్‌టీయూ జెండా అని రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోరాటాల వారసత్వం కలిగిన ఐఎఫ్‌టీయూ అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించిందన్నారు. యూనియన్ విస్తరణలో భాగంగా ఎన్టీపీసీ రామగుండం లేబర్ గేట్ ఎదురుగా నూతన కార్యాలయాన్ని ఈనెల 9న ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మేశ్ హాజరవుతారని తెలిపారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అన్నివర్గాల కార్మికులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తోకల రమేష్, గొల్లపల్లి చంద్రయ్య, రాయమల్లు, రాజేశ్వర్, శైలేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

8న 'ఆర్ఎఫ్‌సీఎల్' సమావేశం


సమావేశంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): ఆర్ఎఫ్‌సీఎల్ ఐఎఫ్‌టీయూ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం ఈనెల 8న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు నాయకులు ఐద శ్రావణ్, రాంకీ తెలిపారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఐఎఫ్‌టీయూ ముందుండి పోరాడుతోందన్నారు. పలు విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. లోడింగ్ అన్ లోడింగ్ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనాలు అందడం లేదని, కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు అమలు చేయాలన్నారు. నలుగురు చేసే పనులను ఇద్దరితో చేయిస్తూ పనిభారం పెంచుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నక్క మల్లేష్, బాసవేని రమేష్, మానుక మధుకర్, మర్రి శ్రావణ్, శివకుమార్, శ్రీకాంత్, అరికెటి రవీందర్, నేతేట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.